


# పొగబండి కథలు

— ఇలేటి శ్రీనివాసభాను

"ఓలమ్మ సంపేసి నాడు బాబో...సచ్చిపోనాన్తల్లో..."
**టైప్ వన్ రైల్వే క్వార్టర్స్‌లో చంద్రమ్మ ఏడుపు వినిపించిందీ అంటే కేబిన్‌మెన్ సూరీడు డ్యూటీ దిగొచ్చాడని కాలనీ వాళ్లకి తెలిసిపోతుంది. ప్యాసింజర్ బండి సైట్ కాగానే స్టేషన్‌లో గంట గణగణమన్నట్లుగా సూరీడు నిర్వాకం ఊరందరికీ అర్థమైపోతుంది. ఆ పరిస్థితిలో....**




# జేవెల ట్రావీ

అతని కళ్లకి, చింతనిప్పులకీ అట్టే తేడా వుండదు. చేతిలో బెల్టు గాల్లోకి లేచిందంటే పడగలేని పామే! సూరీడు నోరు విప్పితే తుంపర్లతో పాటు బూతులూ రాలిపడతాయి. అతను నోరు విప్పినా విప్పకపోయినా విప్ప సారా కంపు గుప్పుమంటుంది. సూరీడు విప్ప సారా తాగి కొంపకి రాగానే చంద్రమ్మ, ఉప్పు చేపతో కూడు పెట్టాలి. పెళ్లయిన కొత్తలో అలా పెట్టింది. ఆ తరువాత చాలా కాలం పెడుతూనే వచ్చింది. అతని సారా కంపునీ, సరసాల్ని భరిస్తూ ముగ్గురు పిల్లల్నీ, రెండు అబార్షన్లనీ చూసింది.

సూరీడు జీతమెంతో చంద్రమ్మకి తెలీదు గానీ, తన జీవితం దరిద్రం కన్నా దారుణంగా వుందని తెలిసిపోయింది. పెద్ద కొడుక్కి బడికి వెళ్లే ఈడు వచ్చినా బడితోవ

తెలీదు. రెండో కొడుక్కి నాలుగేళ్లు నిండినా నడక రాలేదు. కడగొట్టు సంతానం అయిదు నెలల ఆడపిల్ల. అమ్మ పాల రుచిని ఇంతవరకూ చూడలేదు. పొయ్యిలోకి రాక్షసి బొగ్గు దొరికినా, ఎసట్లో పొయ్యడానికి దినుసులు కనిపించవు.

''ఎలా మొగుడా... నేనూ, ముగ్గురు పిల్లలు ఎలా బతకాలి?'' అని చంద్రమ్మ అడగబోతే, జీతం అందుకున్న తరువాత వారం రోజుల పాటు సూరీడు కొంపకే రాడు. కేబిన్ డ్యూటీ దిగుతూనే కనకరాజు పేకాట క్లబ్బుకో, కాశమ్మ సారా కొట్టుకో వెళ్లిపోతాడు. ధ్రువ ప్రాంతంలో ఆరు



నెలలు పగలు..... ఆరునెలలు రాత్రి వుందంటారు. కానీ చంద్రమ్మ బతుకు నెల చివరి వారం ఎలా వుంటుందో మొదటి వారం కూడా అలాగే వుంటుంది. ఊరంతా అప్పులు.. ఇరుగు పొరుగుల నుంచి చేబదుళ్లు. పప్పు అడుక్కోవడం, పాలు అడుక్కోవడం, పూట పూటకీ చేట పట్టుకొని కాలనీ గడపలు గాలించడం! గొణుక్కుంటూ ఇచ్చేవాళ్లు కొందరు... మొహమ్మీదే తలుపులు వేసేవాళ్లు మరికొందరు. దొరికిన రోజులు తక్కువ... పస్తులుండేది ఎక్కువ!

సూరీడు పట్టించుకోడు. పర్సు ఖాళీ కాగానే కొంప గుర్తుకు వస్తుంది. అప్పు చేస్తాడు తాగొస్తాడు. ఇంటిది సణుగుతుంది. వంటిల్లు వెక్కిరిస్తుంది. సూరీడు విరుచుకు పడతాడు.

''ఓలమ్మో సంపేసినాడు బాబో... సచ్చిపోనాన్రల్లో....'' టైప్‌వన్ క్వార్టర్స్‌లో చంద్రమ్మ ఏడుపు వినిపిస్తుంది. ప్యాసింజర్ బండి సైట్ కాగానే స్టేషన్‌లో గంట గణగణ మన్నట్లుగా సూరీడు నిర్వాకం ఊరందరికీ అర్థమైపోతుంది.

***

స్టేషన్ మాస్టర్ సుబ్బారావు తన క్వార్టర్స్ పెరటి వసారాలో కూర్చొని గెడ్డం గీసుకుంటున్నాడు. వీధి వైపు గేటు తెరిచిన చప్పుడైంది.

''యావండీ ఆ కేబిన్ మేన్ పెళ్లాంలా వుంది...'' తడిజుట్టు విరగబోసుకొని కొమ్ము దువ్వెనతో దువ్వుకుంటున్న స్టేషన్ మాస్టారి భార్య శివకామిని చెప్పింది.

''ఎందుకో కనుక్కో'' అన్నాడు సుబ్బారావు.

''పదో పరకో ఇమ్మంటుంది. లేదంటే పప్పు చారో, పాత బట్టలో అడుగుతుంది మామూలే'' అంది, శివకామిని వీధి గడపలోని చంద్రమ్మకి వినిపించేలాగా..

''అందుక్కాదమ్మా నానొచ్చిందీ.... పెద్ద మాస్టారితో కొంచెం మాట్లాడాల'' అంది చంద్రమ్మ. సుబ్బారావు వీధి వసారాలోకి వచ్చాడు.

''ఏమిటి చంద్రమ్మా సూరీడు తాగొచ్చాడా? గొడవ చేశాడా? జీతం అందుకొన్నాక వారం రోజులు డ్యూటీ ఎగ్గొట్టేశాడు. ఇక సహించేది లేదు. టిఐ దొరకి చెప్తాను. సస్పెండ్ చేయిస్తాను''

''నాయిన్నాయిన... ఆ పని మాత్రం సెయ్యొద్దు బాబూ... మీ కాళ్లట్టుకొంటాను'' అంటూ కన్నీరు పెట్టుకుంది చంద్రమ్మ. అంతకు ముందు ఎన్నో సార్లు చెప్పుకొన్న కష్టాలే మళ్లీ చెప్పింది. ఇంట్లో పూట గడిచే ఉపాయం చెప్పమంది.

స్టేషన్ మాస్టర్ సుబ్బారావు ఆలోచించాడు. ''ఓ పని చెయ్'' అన్నాడు. ''ప్రతి నెలా నాలుగో తారీఖున మన స్టేషన్‌కి ట్రాలీ వేసుకొని క్యాషియర్ వస్తాడు. జీతాలిస్తాడు. క్యాషియర్ అలా రాగానే నువ్విలా స్టేషన్‌కి వచ్చేయ్. మీ ఇంటి అవసరాలకి సరిపడే మొత్తాన్ని సూరీడు జీతంలోంచి మినహాయించి నీ చేతిలో పెడతాను'' తరుణోపాయాన్ని చెప్పాడు సుబ్బారావు.

తలూపింది చంద్రమ్మ. పెద్ద మాస్టారి పాదాల మీద పడి – ''మీ పేరు సెప్పుకుంటాను. నా పిల్లలకి కడుపు నిండా తిండిపెడతాను'' అంది.

***

ఆ నెల గడిచింది.

మరుసటి నెల నాలుగో తారీఖు రాగానే–

''అమ్మా.... అద్దదిగో ట్రాలీ.... జీతాల ట్రాలీ ఎలిపొస్తోంది.'' చంద్రమ్మ పెద్దకొడుకు గడప లోంచి అరిచాడు.

చంద్రమ్మ స్టేషన్‌కి పరుగుతీసింది. స్టేషన్ మాస్టారి ఉపాయం ఫలించింది. ఆయన ముందు నోరు విప్పలేకపోయాడు కాబిన్ మేన్ సూరీడు. ఆరోజు రాత్రి చంద్రమ్మ తన పిల్లలకి కడుపునిండా కూడు పెట్టింది.

***

అలాంటి నాలుగు రాత్రులు... అయిదు పగళ్లు గడిచాయి. ఆ రాత్రయినా తన భర్త ఇంటికి వస్తాడో... రాడో... వంటింటి సరుకులు తెస్తాడో.. తేడో.. అని స్టేషన్ మాస్టర్ సుబ్బారావు కోసం ఎదురుచూస్తోంది ఆయన భార్య శివకామిని. ఆ అయిదు రోజులూ స్టేషన్ బాధ్యతలు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌కి అప్పగించిన సుబ్బారావు– నాలుగు స్టేషన్లకి అవతల పెర్మనెంట్ వే ఇన్‌స్పెక్టర్ బంగ్లాలో పేకదస్తాని బాగా కలిపి, కత్తిరి వేసి, కట్‌ఫర్ సీట్స్ తీస్తున్నాడు. ఎన్ని సీట్లు మారినా సుబ్బారావు హ్యాండ్ డౌన్‌లోనే వుంది.

''వచ్చే నెలలో జీతాల ట్రాలీ రానివ్వండి... అప్పుడు చెప్తాను మీ పని...'' ఆ రాత్రి గట్టిగా నిశ్చయించుకుంది స్టేషన్ మాస్టారి భార్య శివకామిని.

★



# అమ్మ చెప్పిందే వేదం

త్రిషాకు వివాదాలు, వివాదాలకు త్రిషా కొత్త కాదు. సినిమాలు చేసినా చేయకపోయినా ఆమె పేరు ఏదో రకంగా వార్తల్లో నానుతూనే ఉంటుంది. విడిపోయిన ప్రేమికులు నయనతార, సింబులు మళ్ళా ఇటీవల కలిసిపోవడంలో త్రిషా ముఖ్య పాత్ర పోషించిందని రూమర్లు వినిపిస్తున్నాయి. అంతే కాదు యంగ్ స్టార్ విశాల్‌తో ప్రేమలో పడిందని కూడా వార్తలు వస్తున్నాయి. అయితే ఆమె తల్లి ఉమా కృష్ణ మాత్రం ఇవన్నీ కట్టుకథలేనని కొట్టిపారేస్తుంది. త్రిషా కెరీర్‌ని ఇంత విజయవంతంగా తీర్చిదిద్దడంలో కూడా ఆమెదే ముఖ్య పాత్ర. అయితే త్రిషా తన తల్లిపై అవసరమైనదానికన్నా కాస్త ఎక్కువే ఆధారపడుతుందని విసుక్కుంటున్నారు సినీవాలాలు. డేట్లనుండి డ్రెస్సుల వరకూ అంతా ఆమె ఇష్టమేనట. చివరికి ఎవర్ని పెళ్ళి చేసుకుంటారని త్రిషాను అడిగినా, ''నాకు మొత్తం అన్నీ అమ్మే. ఆమె ఎవర్ని పెళ్ళి చేసుకోమంటే వాళ్ళని చేసుకుంటా. ఇందులో నా వ్యక్తిగత నిర్ణయం ఏమీ ఉండబోదు'' అన్న రొటీను డైలాగే వినిపిస్తోందట.